క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సరుబుజ్జిలి: ఈ నెల 6వ తేదీన స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సరుబుజ్జిలి, యరగాం, రొట్టవలస ఫీడర్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ ఫీడర్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ పరిధిలో గల వివాదాస్పద స్థలాన్ని తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా బుధవారం పరిశీలించారు. కొన్నేళ్ల కిందట గోకర్ణపురం నుంచి సంతలక్ష్మీపురం, తదితర గ్రామాలకు వెళ్లేందుకు కంకర రహదారి నిర్మించారు. ప్రస్తుతం గోకర్ణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీతో రహదారి మధ్యలో తవ్వారు. ఈ సమాచారం రెవెన్యూ అధికారులకు తెలియడంతో రోడ్డును పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి జిరాయితీగా ఉన్నట్లు తెలిపారు. అయినప్పటికీ పునఃపరిశీలన చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎర్రయ్య, వీఆర్వో సింహాచలం, సర్పంచ్ రవికుమార్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

నరసన్నపేట: స్థానిక ధర్మాన రామలింగన్నాయుడు (డీఆర్ఎన్) డిగ్రీ కళాశాల ఆవరణలో పీఎం విశ్వకర్మ నైపుణ్య శిక్షణ తరగతులు గురువారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు శిక్షణ తరగతుల ప్రతినిధి రహీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 రకాల సంప్రదాయ కళాకారులు, చేతి వృత్తుల వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పీఎం విశ్వకర్మ నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంట్లో భాగంగా నరసన్నపేట నియోజకవర్గంలో 2,100 మంది యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారందరికీ విడతల వారీగా శిక్షణ ఇస్తామన్నారు. ఒక బ్యాచ్‌లో 45 మంది ఉంటారని, వారం రోజులు శిక్షణ ఉంటుందన్నారు. గురువారం నుంచి కార్పెంటర్, దోబీలకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు హాజరైన వారికి ఒక్కక్కరికీ రోజుకు రూ.500 ఇస్తామని, చివరి రోజున సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ శిక్షణను వినియోగించుకోవాలని కోరారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి, అధికారులు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెం పరిధిలో గల మినీస్టేడియం దగ్గర ప్రభుత్వ ఐటీఐ కళాశాల, బాడ్మింటన్ కోర్టుకు రెండెకరాల స్థలాన్ని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి బుధవారం పరిశీలించారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న సవర లావణ్య అక్టోబర్ 17వ తేదీన మృతి చెందింది. విద్యార్థిని మృతికి గల కారణాలపై ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, అధ్యాపకులను విచారించారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఆర్డీఓ కార్యాలయ సర్వేయర్ జనార్ధనరావు, మండల సర్వేయర్ రామగణపతిరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. రహదారి పనుల ప్రగతిపై నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభించిన పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తికావాలన్నారు. ఎక్కడైనా పనులు ప్రారంభించకపోతే వెంటనే మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పనుల పురోగతిపై చర్చించారు. పనులు అన్ని చోట్లా జరుగుతున్నాయని, డిసెంబర్ ఆఖరుకల్లా పూర్తవుతాయని పీఆర్ డీఈ సత్యంనాయుడు తెలిపారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు ఇప్పించాలని అధికారులకు ఎమ్మెల్యే రమణమూర్తి సూచించారు.

నిప్పుతో ముప్పు!

- పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం
- భూసారాన్ని దెబ్బతీస్తున్న రైతుల ఆలోచనలు
- యంత్రాలతో కోత జరిగిన చోటే ఇలాంటి పరిస్థితి
- పొలంలో కలియదున్నితే మేలు



ఎల్.ఎన్.పేట మండలం కృష్ణాపురం వద్ద పొలంలో గడ్డిని కాల్చేస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పండింది. నెల రోజులుగా యంత్రాల ద్వారా కోతలు, నూర్పిడి ముమ్మరంగా జరుగుతున్నాయి. అదే పొలంలో రబీలో మరోపంట వేసేందుకు పొలాన్ని దుక్కి, దమ్ము చేసేందుకు పంట వ్యర్థాలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. రైతులు వరిచేను వర్థ్యాల (గడ్డి)కి పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. రైతులు తీసుకుంటున్న ఈ నిర్ణయం కారణంగా వారికి తెలియకుండానే భూసారాన్ని నాశనం చేస్తున్నారు.

యంత్రాలతో కోతలు జరిగిన పొలంలోనే..

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ వరిచేను కోతలు కోసిన రైతులు పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. యంత్రాల ద్వారా వరిచేను కోత కోసిన సమయంలో పొలంలో ఎక్కువ ఎత్తులో కోత చేస్తారు. కోసిన తరువాత ధాన్యం ఇంటికి చేరుకోగా.. పంట వ్యర్థాలు (గడ్డి) పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే దుక్కి, దమ్ము చేసేందుకు వ్యర్థాలు (గడ్డి) లేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒకచోటకు చేర్చి కుప్పపెట్టాలంటే రైతులకు అదనపు ఖర్చుతో కూడిన పని అవుతుంది. గడ్డికి నిప్పుపెట్టిన తరువాత రబీ పంటను వేసుకుంటున్నారు.

మిత్ర పురుగులకు హాని..

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు క్షీణిస్తున్నాయని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలో పరుచుకున్న గడ్డిని కాల్చడం వలన భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు వేడికి నాశనం అవుతున్నాయి. భూమిలో ఉండే వానపాములు, ఇతర సిలీంద్రాలు అంతరించి పోవటం వలన భూమికి నష్టం జరుగుతుందని తెలియజేస్తున్నారు.

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) వివరాలు ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం
కొత్తూరు	19,500
హిరమండలం	6,850
ఎల్.ఎన్.పేట	12,580
పాతపట్నం	18,500
మెళియాపుట్టి	21,000

మరో పంటకు ఇబ్బంది లేకుండా



వరిచేను యంత్రాలతో కోత కోసిన తరువాత పొలంలో గడ్డి ఉండిపోతుంది. గడ్డి మట్టిలో కలిసేందుకు ఎక్కువ సమయం పడుతుంది. మరోపంట వేసుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున గడ్డిని కాల్చేస్తున్నాం. తరువాత పొలాన్ని దుక్కి, దమ్ము చేసి రెండో పంట వేసుకుంటున్నాం.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

అవగాహన కల్పిస్తున్నాం..



పొలంలో పంటల వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన భూమి పొరల్లో ఉన్న శిలీంద్రాలు, ఇంతర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నిశించిపోతాయి. యంత్రాలతో కోత కోసిన తరువాత వ్యర్థాలను ఒకచోట చేర్చి అవి కుళ్లేలా చేయటం వలన సేంద్రీయ ఎరువు తయారు అవుతుంది. ఆ ఎరువును పొలానికి వాడుకోవచ్చు. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

కేజీబీవీ ఎస్ఓ, సిబ్బందిపై విచారణ



కేజీబీవీలో ఎస్ఓ, సిబ్బందిని విచారిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామ కేజీబీవీ ఎస్ఓపై విద్యార్థిని తండ్రి నీలయంనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంఈఓలు శ్రీనివాసరావు, గోవిందరావు స్పందించారు. ఎస్ఓను, విద్యార్థిని తల్లిదండ్రులను ఎంఈఓ కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నట్లు ఎస్ఓ చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. భోజనం నాణ్యతగా లేదని ఫిర్యాదు ఇచ్చిన తరువాత తమ కుమార్తెకు ఎస్ఓ, వంట మహిళలు వేధిస్తున్నారని తల్లిదండ్రులు చెప్పడంతోపాటు వీడియోను చూపించారు. కేజీబీవీలో చదవడానికి ఇష్టం లేకపోతే టీసీ ఇచ్చి పంపిస్తామని ఎస్ఓ తమ కుమార్తెకు భయపెట్టారన్నారు. వంట మహిళలు పలు రకాల మాటలతో ఇబ్బంది పెడుతున్నట్లు తమ కుమార్తె చెప్పిందన్నారు. అనంతరం కేజీబీవీని ఎంఈఓ శ్రీనివాసరావు సందర్శించారు. వంట మనుషులతోపాటు సిబ్బందితో మాట్లాడారు. వంట సక్రమంగా చేయాలని సూచించారు. భోజనాలు నాణ్యతగా చేయించాలని ఎస్ఓకు ఆదేశించారు. భోజనం బాగులేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విచారణ నివేదికను డీఈఓకు నివేదిస్తామని ఎంఈఓ తెలిపారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్ల సంఘం సభ్యులు

సారవకోట: తమపై పని ఒత్తిడి తగ్గించాలని తహసీల్దార్ విజయలక్ష్మికి సచివాలయ సర్వేయర్లు బుధవారం వినతిపత్రం అందించారు. సచివాలయ పరిధిలో సర్వే పనులు అప్పగించారని, దీంతో ఆయా పనులలో భాగంగా గ్రామాల్లో ఉండటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సచివాలయానికి వచ్చి హాజరు వేయాల్సిన పని లేకుండా తాము సర్వే చేసిన చోటనుంచే హాజరు వేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. తమకున్న పనులతోపాటు ఇతర పనులు అప్పగించడం వలన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని, తమపై పని ఒత్తిడి తగ్గించాలని విన్నవించారు. సర్వేయర్ల సంఘం స్టేట్ కో ఆర్డినేటర్ లోకేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే సహించేది లేదు



వసతిగృహాన్ని పరిశీలించిన దళిత నాయకులు

కొత్తూరు: మండలంలోని కురిగాం ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్‌ను వేధిస్తే సహించేది లేదని దళిత మహాసభ కొత్తూరు మండలశాఖ నాయకుడు బి.కృష్ణారావుతోపాటు పలువురు అన్నారు. బుధవారం వసతిగృహాన్ని సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజన పెట్టడంతోపాటు మెనూ పాటిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్ జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. వసతి గృహంలో రాత్రిపూట నిద్రించని విద్యార్థులకు హాజరు వేయకపోవడంతోనే వార్డెన్‌ను కొంతమంది వేధిస్తున్నారన్నారు. వార్డెన్‌పై వేధింపులు ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘం నేతలు, సర్పంచ్ నాస బాలకృష్ణ, వడమ శ్రీనివాసరావు, పడాల నాగభూషణరావు, తలచంద్ర రాంబాబు, విశాక సూరిబాబు, ఎం.ప్రశాంత్, జి.లక్ష్మణరావు, మహేంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నరసన్నపేట:

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ సదస్సుల వివరాలను వెల్లడించారు. 6న గొట్టిపల్లి, 7న సత్యవరం, 9న బొడ్డవలస, 10న మడపాం, 11న నడగాం, 12న లుకలాం, 13న పోతయ్యవలస, కొత్తపోలస, 16న అంప్లాం, కరగాం, 17న చేనులవలస, గోకయ్యవలస, 18న చోడవరం, కొబగాం, 19న వీఎన్పురం, ఉర్లాం, 20న తెలగవలస, పారశెల్లి, 21న గోపాలపెంట, దేవాది, 23న కోమర్తి, యారబాడు, 24న జమ్ము, దశుమంతపురం, 26న కిళ్లాం, మాకివలస, 27న బసివలస, బాలసీమ, 28న నారాయణవలస, నర్సింగపల్లి, 30న శ్రీరాంపురం, రావులవలస, 31న చిక్కాలవలస, మామిడివలస, జనవరి 2న కంబకాయ, 3న బాడాం, తోటాడల్లో, 4న నర్సింగరాయుడుపేట, వెంకటాపురం, 6న చిట్టివలస, రెల్లివలసల్లో, 7న తామరాపల్లి, బొరిగివలస, 8న సుందరాపురం సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సరుబుజ్జిలి మండలంలో..

సరుబుజ్జిలి: ఈ నెల 6 నుంచి, జనవరి 3 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎల్.మధుసూదన బుధవారం ప్రకటనలో వెల్లడించారు. ఈ సదస్సుల్లో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ రెవెన్యూ సదస్సులు ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. 6న కొరసవాడ, 7న చాకిపల్లి, 9న ఎస్.ఎస్.మనుగు, 10న బోరుభద్ర, 11న బద్దుమర్రి, 12న లాబర, 13న బద్దుమర్రి, 16న తెంబూరు, 17న గంగువాడ, 18న ఆర్.ఎల్.పురం, సోద, 19న ఎస్.ఎస్.మనుగు, 20న పాశీగంగుపేట, 21న బూరగాం, 23న చిన్నపద్మాపురం, 24న పెద్దమల్లిపురం, 26న నల్లకొత్తూరు, 27న స్టువర్ట్‌పురం, 28న రొంపివలస, 30న జగిలిబొంతు, 31న పెద్ద సున్నాపురం, జనవరి 2న తామర, 3న చంగుడి, సరాలి, 4న దాసుపురం, కొదండపురం, 6న దశరథపురం, 7న పాతపట్నం, 8న సీదీ, తిడ్డిమిలో సదస్సులు ఉంటాయన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హనుమంతురావు సూచించారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు. భూ సమస్యలుంటే గ్రామ సభకు వచ్చే అధికారుకలకు రైతులు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

సారవకోట: పంచాయతీ కార్యదర్శుల మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఈఓపీఆర్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గంలో అధ్యక్షుడిగా జి.మురళి, ఉపాధ్యక్షుడిగా ఆర్.సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.సంహాచలం, కోశాధికారిగా పి.జ్యోతి, నిర్వాహక కార్యదర్శిగా కె.గోపి, కార్యవర్గ సభ్యులుగా గౌరీశంకర్, బి.లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అందుబాటులో ఎరువులు

ఎల్.ఎన్.పేట: మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులకు అందుబాటులో ఎరువులు సిద్ధంగా ఉంచామని ఏఓ పైడి లతశ్రీ బుధవారం తెలిపారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల ద్వారా ఇప్పటికే ఎరువులు విక్రయించటం జరిగిందన్నారు. ఇంకా ఎరువులు కావల్సిన వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, బసవరాజుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, స్కాట్‌పేట, మోదుగువలస తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంట చేస్తున్నారన్నారు. రైతులకు అవగాహన కల్పించేలా గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులకు తగిన సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు.

వీఆర్వోపై దాడి శోచనీయం

నరసన్నపేట: విధుల్లో ఉన్న పొందూరు మండలం తోలాపి వీఆర్వో ఎం.దివాకరరావుపై దాడి చేయడం అమానుషమని వీర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్పెళ్ల అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు అప్పనాయుడు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దాడిని వీఆర్వోల సంఘం ఖండిస్తుందన్నారు. దాడికి పాల్పడిన పప్పల రామినాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి భౌతిక దాడులు సరైనవి కాదని, ప్రతి ఒక్కరూ ఇటువంటి దాడులను ఖండించాలన్నారు. దీనిపై పొందూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

7న మండల సమావేశం

సారవకోట: ఈ నెల 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సర్వే పూర్తిచేయాలి



తెంబూరు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలో హౌస్ హోల్డ్, ఎంఎస్ఎంఈ సర్వేలను సచివాలయ సిబ్బంది పూర్తి చేయాలని ఎంపీడీఓ టి.చంద్రకుమారి ఆదేశించారు. మండలంలోని తెంబూరు, పెద్దలోగిడి, గంగువాడ గ్రామ సచివాలయాలను బుధవారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడు?



సరుబుజ్జిలి మండలంలోని పెద్ద పాలెం నుంచి చిన్నపాలెంకు వెళ్లే పంచాయతీరాజ్ అంతర్ రహదారి అధ్వానంగా ఉంది. ఏమాత్రం వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరుతుంది. పూర్తిగా మట్టి రహదారి కావడం వలన నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో గ్రామంలోకి వాహనాలు రాలేని పరిస్థితి. అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

చెత్తతో నిండిన నీటిగుంత



సారవకోట మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ భవనానికి ఆనుకుని నిర్మించిన వాటర్ హార్వేస్టింగ్ చెత్తతో నిండింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో వర్షపు నీరు భూమిలోకి ఇంకడానికి వీలుగా ఉపాధి హామీ పథకం ద్వారా దీనిని నిర్మించారు. విద్యాశాఖా కార్యాలయం భవనంపై పడిన వర్షం నీరు పైపుల ద్వారా ఈ గుంతలోకి వెళ్లి.. ఆ నీరు భూమిలోకి ఇంకే విధంగా నిర్మించారు. ప్రస్తుతం నీటి గుంత చెత్త, ఆకులతో నిండిపోయింది.

– సారవకోట

సీసీ కెమెరాల ఏర్పాటు



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్కూల్ కిచెన్ షెడ్‌లో ఇటీవల దొంగతనం జరగడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం వెంకటరావు బుధవారం తెలిపారు. పూర్వ విద్యార్థులు కండవల్లి శ్రీధర్, సీటీ కేబుల్ దాలినాయుడులు వీటిని వితరణ చేశారన్నారు. ఆరు చోట్ల కెమెరాలు అమర్చామన్నారు. వీటి ఫుటేజీలు నిక్షిప్తం అవుతున్నాయన్నారు.

– నరసన్నపేట

భౌబోయ్..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండల కేంద్రంలో సంచరిస్తున్న కుక్కల గుంపు. మండలంలోని పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట, పెదమాలపేట, యరగాం, తెలికిపెంట, నందికొండ, సరుబుజ్జిలి గ్రామాల్లో పశువులపై దాడులు చేస్తున్నాయి. మనుషులకు తరచూ గాయపరుస్తున్నాయి. కుక్కల నివారణా చర్యలు తీసుకోకపోవడం వలన వీధిలోకి అడుగు పెట్టాలంటే చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయపడుతున్నారు.

– సరుబుజ్జిలి

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ సూచించారు. బుధవారం పురపాలక సంఘంలోని 16వ వార్డులో సంకల్పం పేరిట ప్రజలకు అవగాహన కల్పించారు. రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బూర్జ: మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.ప్రవల్లిక సూచించారు. మండలంలోని ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

నరసన్నపేట:

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో వివాహాలు చేస్తే ఎన్నో అనర్థాలకు దారితీస్తున్నాయని, వీటిని పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ బి.మధుసూదనరావు, ఐసీడీఎస్ పీఓ నాగమణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బాలికల కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలికలను చదివించాలని, ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో కిశోరి బాలికల గ్రూప్ ఏర్పాటు చేసి, వారికి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేపట్టాలన్నారు. ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత మాట్లాడుతూ.. బాలికల్లో రక్త హీనత అధికంగా ఉంటుందని, తల్లిదండ్రులు గమనించి మంచి ఆహారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ప్రతినిధి జనార్ధనరావు, ఈఓపీఆర్డీ రేణుక, ఎంఈఓ దాలినాయుడులు పలు సూచనలు చేశారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన

ఎల్.ఎన్.పేట: కిశోర బాలికల ఆరోగ్యం పట్ల వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ యు.విమలకుమారి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కిశోరి బాలికల వికాసం కోసం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పేదింటి పిల్లలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారి స్వంత శక్తిపై నిలబడగలిగే అవకాశాలను కల్పించేలా వారిని తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రమౌళి, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఎస్.సునీత, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు గౌస్య బేగం, నవ భారతి, జ్యోతిలక్ష్మి, టీఓటీ ఎల్.పార్వతమ్మ, వి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.